సాక్షి
వనపర్తి
సోమవారం : 3 : జూలై : 2023



నల్లమలలో విహారానికి విరామం
నల్లమలలో ఫర్హాబాద్ సఫారీని అధికారులు మూడు నెలల పాటు మూసివేశారు.
వివరాలు 8లో ▸



పదేళ్లుగా అవే రోడ్లు..
మూలమళ్ల – జూరాల ప్రాజెక్టు రహదారి కనీస మరమ్మతుకు నోచుకోవడం లేదు.
వివరాలు 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.1 /24.2
వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: 2023–24 విద్యాసంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 1, 5వ తరగతిలో ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌ఈడీఓ ఎ.నుషిత ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. జిల్లాకు చెందిన విద్యార్థులు అర్హుల ని.. ఈ నెల 15లోగా ఐడీఓసీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈ నెల 20న లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

ఆత్మకూర్: గురుపౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని సాయిబాబా మంది రంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్ రావు ఆదివారం తెలిపారు. తెల్లవారుజామున 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు కాగడ హారతి, 6.15 నుంచి విఘ్నేశ్వర, నందీ శ్వర, దత్తాత్రేయ, సంతాన నాగదేవత, జ్యోతి ర్లింగ, రాంపరివార్, లక్ష్మీదేవి, షిర్డీ సాయినా థ్‌కు పంచామృతాభిషేకం, ఉదయం 8 గంట లకు కావిడి ఉత్సవం, 9 గంటలకు అర్చన, అష్టోత్తరం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, 12.30కి అన్నదానం, సాయంత్రం 6.20కి ధూప హారతి, 6.45కి సాయి భజన, రాత్రి 7.30కి పల్లకీసేవ, 8.40కి సేజారతి పూజలు ఉంటాయని.. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వికారాబాద్ కలెక్టర్ ప్రత్యేక పూజలు..



ఆత్మకూర్: పట్టణంలోని షిర్డీ సాయిబాబ ఆల యంలో ఆదివారం రాత్రి వికారాబాద్ కలెక్టర్ నారాయణ్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వగ్రామమైన నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని శ్రీపూర్‌కు వచ్చిన ఆయన ఆలయానికి వచ్చారు. మందిర కార్య దర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు కలెక్టర్ దంపతు లను శేష వస్త్రాలతో సత్కరించారు.

అర్హులందరికీ రూ.లక్ష రుణం ఇవ్వాలి

వనపర్తి: జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రూ.లక్ష రుణం ఇవ్వాలని విశ్వబ్రా హ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర ఆచారి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ జాతిలోని వడ్ల, కమ్మరి, కంచ రి, శిల్పి, స్వర్ణకారులు వృత్తిపనులు చేసుకుం టూ ప్రోత్సాహం లేక ఇబ్బందులు పడుతు న్నారన్నారు. రాష్ట్ర నాయకుడు బ్రహ్మచారి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విశ్వ బ్రాహ్మణ జాతికి రూ.250 కోట్లతో కార్పొరే షన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మాట లకే పరిమితమైందని తెలిపారు. కార్యక్రమం లో సంఘం పట్టణ అధ్యక్షుడు పి.వెంకటాచా రి, నాయకులు ఎం.సత్యనారాయణచారి, జిల్లా కోశాధికారి ఎస్.మాధవాచారి, జి.మల్లేష్ ఆచారి, హిమవంతు ఆచారి తదిత రులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,016 అడుగుల వరకు నీరు చేరిం ది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు నీటిని ఆపేశారు. కేవలం తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రనీల్ రెడ్డి తెలిపారు.

ముందడుగు



జిల్లాకేంద్రంలోని పెబ్బేరు రహదారి

జిల్లాకేంద్రంలోని పెబ్బేరు రహదారి విస్తరణకు మోక్షం

- ఆక్రమణల లెక్క తేల్చేందుకు డాక్యుమెంట్ల సేకరణ
- వ్యాపార సముదాయాలు ఉండటంతో అందరిచూపు అటువైపే..
- కలెక్టర్ చొరువతో ముందుకు సాగుతున్న యంత్రాంగం

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలో చోటా బడా వ్యాపార సముదాయాలున్న పెబ్బేరు రహదారి విస్తరణకు మోక్షం లభించింది. రెండేళ్ల కిందట నాగవరం, గోపాల్‌పేట, చిట్యాల, పాన్‌గల్ వైపు రహదారుల విస్తరణ చేపట్టిన కొద్ది రోజులకే ఈ రహదారి విస్త రణ చేయాలని అధికారులు నిర్ణయించినా ముంద డుగు పడలేదు. అప్పుడూ ఇప్పుడూ అంటూ పాల కపక్షం కాలయాపన చేస్తూ వచ్చింది. పేదలుండే ప్రాంతాల్లో చొరవ చూపిన రీతిలో బడా వ్యాపారు లుండే ప్రాంతాల్లో విస్తరణకు మొగ్గుచూపడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. నాగవరం వైపు రహదారి విస్తరణ పనులు పూర్తికాగా.. మిగిలిన రహదారుల పనులు తుదిదశలో కొనసాగుతు న్నాయి. పెబ్బేరు వైపు కూడా రహదారి విస్తరణ పనులు ప్రారంభించేందుకు కలెక్టర్ చొరవ చూపడంతో ముందడుగు పడింది. ఈ క్రమంలో వివేకానంద మార్గ్ నుంచి బస్టాండ్, ఆర్డీఓ కార్యాల యం, రామాలయం మీదుగా మర్రికుంట వరకు రహదారిని విస్తరించేందుకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న బడా, చోట వ్యాపారులతో కలెక్టర్ రెండ్రోజుల కిందట సమావేశం నిర్వహించి సహకరించాలని కోరారు.

డాక్యుమెంట్ల పరిశీలన..

పెబ్బేరు రహదారిని కిలోమీటర్ పైబడి విస్తరించేం దుకు నిర్ణయం తీసుకున్నారు. రహదారికి ఇరువై పులా ఉన్న మెజార్టీ దుకాణదారుల అభిప్రాయా లకు అనుగుణంగా చర్యలు చేపట్టనున్నారు. రహదారి విస్తరణలో నష్టపోయే వారితో (కొన్నిచో ట్ల ఆక్రమణదారులు కూడా ఉన్నారు) మూడేళ్లుగా పుర అధికారులు, పాలకులు తప్పా ఇతర అధికా రులు ఎవరూ సమావేశాలు నిర్వహించలేదు.

సర్వే కొనసాగుతోంది..



విశాలమైన రోడ్లతోనే పట్టణాభివృద్ధి సాధ్యం. కావున వ్యాపారులు, ప్రజలు పెద్ద మనసుతో పెబ్బేరు రహదారి విస్తర ణకు సహకరించాలి. రహదారి విస్తరణతో వ్యాపార లావాదేవీలు పెరిగే అవకాశం ఉంటుంది. పెబ్బేరు రహదారి 100 అడుగులు విస్తరించేందుకు ప్రభుత్వ అను మతులు ఉన్న మాట వాస్తవం. ఈ రహదారిలో నిర్మాణాలు అనుమతి మేరకు ఉన్నాయా? లేవా? తెలుసుకునేందుకు డాక్యుమెంట్ల జిరాక్స్ ప్రతులను సేకరిస్తున్నాం. దీంతో ఆక్ర మణదారుల లెక్క తేలనుంది.
– విక్రమసింహారెడ్డి, పుర కమిషనర్, వనపర్తి

మూడేళ్లు కావస్తున్నా..

జిల్లాకేంద్రంలోని చిట్యాల రోడ్డు, గోపాల్‌పే ట, పాన్‌గల్ రహదారి విస్తరణకు 38 నెలల సమయం పట్టింది. 2020, ఏప్రిల్ 25న చిట్యాల రోడ్డు మలుపు వద్ద విస్తరణ పను లకు శ్రీకారం చుట్టారు. చిన్నచిన్న పనులు, హైలెవల్ వంతెనలు తుదిరూపునకు చేరుకు న్నాయి.

పెబ్బేరు రహదారి విస్తరణకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపడంతో పాటు ఆక్రమణదారులు ఎంత మంది ఉన్నారో లెక్క తేల్చాలని పుర అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో అధికారులు భవన యజమా నుల వద్దకు వెళ్లి డాక్యుమెంట్ల జిరాక్స్ ప్రతులను శనివారం నుంచి సేకరిస్తున్నారు. ఉన్న స్థలానికి మించి నిర్మాణాలు చేసుకున్నట్లు పుర అధికారులు ప్రాథమిక అంచనకు వచ్చారు. ప్రస్తుతం ఈ రహదారి 80 అడుగుల వెడల్పు ఉండగా.. 100 అడుగుల మేర విస్తరించేందుకు ఆమోదం ఉన్నప్ప టికీ, భవన యజమానుల ఒత్తిడి మేరకు కొంత తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది.

సాగునీటికి ఎదురుచూపులు



నీరు లేక వెలవెలబోతున్న జూరాల ఎడమ కాల్వ

వరి నారుమడుల ఏర్పాటుకు రైతులకు తప్పని తిప్పలు

- వర్షాలు కురుస్తేనే నీటి విడుదల అంటున్న జూరాల అధికారులు

పెబ్బేరు: వానాకాలంలో నెల ముందుగానే వరి సాగు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధి కారులతో గ్రామాల్లో రైతులకు అవగాహన కార్య క్రమాలు నిర్వహిస్తోంది. దీంతో సాగునీటితో పాటు వేసవిలో తాగునీరు ఇబ్బందులు ఉండవని చెబుతు న్నారు. ఈ ఏడాది రైతులు కూడా ముందుగానే పం టల సాగుకు సిద్ధమయ్యారు. జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ఆయకట్టు కింద 85 వేల ఎక రాల వరి సాగు చేసే అవకాశం ఉంది. జూన్ రెం డోవారంలో సాగునీరు విడుదల చేస్తారని రైతులు భావించినా.. ఆశించిన మేర వర్షాలు కురవకపోవ డంతో జూరాల ప్రాజెక్టు అధికారులు చేతులెత్తే శారు. దీంతో రైతులు చేసేది లేక పొలాలు దుక్కి దున్ని చదును చేసి సాగునీటి కోసం ఎదురుచూ స్తున్నారు.



వరి సాగుకు చదును చేసిన పొలాలు

అదును దాటుతోంది..



వానాకాలం వరిసాగుకు అదును దాటుతోంది. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత ఉన్న నిల్వ నీటిని నారుమడులు పోసుకునేందుకు విడుదల చేయాలి. వానాకాలం నీటి విడుదల వరకు జూరాల డిస్ట్రిబ్యూటరీ, పిల్ల కాల్వల్లో పూడికతీత చేపట్టాలి. అక్కడక్కడ ధ్వంసమైన కాల్వలకు మరమ్మతులు చేయించాలి.
– కదారి వెంకటయ్య, రైతు, సూగూరు (పెబ్బేరు)

వర్షాలు లేకనే..



వానాకాలంలో వరి సాగు చేయాలంటే వర్షాలు బాగా కురవాలి. దీంతో భూమికి కావాల్సిన నీరు అంది వరి నారు వేయడా నికి వీలుగా ఉంటుంది. ఈసారి వర్షాలు ఆలస్యంగా వచ్చేటట్లు ఉన్నాయి. కాబట్టి వరి నారుమడులు కోసం జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వకు అధికారులు నీటిని విడుదల చేయాలి.
– దొబ్బలి వెంకటయ్య, శేరుపల్లి (శ్రీరంగాపూర్)

ఆలస్యం కావొచ్చు..



జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నేటి వరకు వరద నీరు రాలేదు. మహా రాష్ట్ర, కర్ణాటకల్లో భారీ వర్షాలు కురుస్తేనే ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది. అప్పుడే దిగువ ప్రాంతానికి, ఎడమ కాల్వ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయగలం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వానాకాలం సాగుకు నిల్వనీటిని విడుదల చేస్తాం. ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం ఉంది.
– జగన్మోహన్‌రెడ్డి, ఈఈ, జూరాల ఎడమ కాల్వ

అరుణాచలం క్షేత్రానికి ఆరు ప్రత్యేక బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పౌర్ణమిని పురస్కరించు కొని మహబూబ్‌నగర్ నుంచి అరుణాచలం గిరి క్షేత్రంకు వెళ్లే టూర్ ప్యాకేజీ ప్రత్యేక బస్సులను ఆది వారం రీజినల్ మేనేజర్ శ్రీదేవి ప్రారంభించారు. పూజలు నిర్వహించి ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సం స్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు అరుణాచలంకు రాష్ట్రవ్యాప్తంగా 32 బస్సులు వెళ్లినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ నుంచి ఆరు బస్సులు, హైదరా బాద్ నుంచి మరో రెండు బస్సులు బయలుదేరి నట్లు తెలిపారు. ప్రయాణికులు ఆదరిస్తే ముమ్ముం దు మరిన్ని బస్సులు నడుపుతామని తెలిపారు. మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి ఉదయం 8 గంట లకు ప్రత్యేక లగ్జరీ బస్సు బయలుదేరి మార్గమధ్యం లో కాణిపాకం గణపతి దర్శనం అనంతరం అదే రోజు రాత్రి 8 గంటలకు బయలు దేరి రాత్రి 10 గం టలకు చేరుకుంటుందని తెలిపారు. 3వ తేదీన అరుణచాలం గిరి ప్రదక్షిణ అనంతరం సాయంత్రం 3 గంటలకు బస్సు బయలుదేరి వేలూరులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం 4వ తేదీ ఉదయం 8 గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకుం టుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజి నల్ మేనేజర్ శ్యామల, డిపో మేనేజర్లు సుజాత (మహబూబ్‌నగర్), ధరంసింగ్ (నాగర్‌కర్నూల్), పరమేశ్వరి (వనపర్తి) పాల్గొన్నారు.



అరుణాచలం ప్రత్యేక బస్సులను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి తదితరులు

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఆత్మకూర్: ఖమ్మంలో ఆదివారం జరిగిన జనగర్జన సభతో అధికార బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల్లో వణుకు మొదలైందని.. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వ మేనని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మక్తల్ నియోజ కవర్గ ముఖ్య నాయకులతో కలిసి ఖమ్మంలో జరిగిన సభకు వెళ్తూ మాట్లాడారు. బీఆర్‌ఎస్ మోస పూరిత పాలన, బీజేపీ మతతత్వ రాజకీయాలతో ప్రజలు విసుగెత్తారని, వచ్చే ఎన్నికల్లో 90 స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రెయిన్‌బో విష్ణువర్ధన్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, అయ్యూ బ్‌ఖాన్, తులసీరాజ్, రహ్మతుల్లా, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, గంగ, విషు శ్రీను పాల్గొన్నారు.

యువత సైనికుల్లా పని చేయాలి

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: యువత రాజకీయంగా ఎదుగుతూ బీఆ ర్‌ఎస్ పార్టీ కోసం సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉద్యమకాలంలో పనిచేసిన వారికి, పార్టీ కోసం కష్ట పడి పనిచేస్తున్న వారికి తగిన గుర్తింపునిస్తూ అవకా శాలు కల్పిస్తామని తెలిపారు. అడ్డాకులలో ఆది వారం బీఆర్‌ఎస్ యువత ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో యువత కీలక భాగస్వామ్యం పోషించాలని కోరారు. సీనియర్ నాయకులు యువకులను రాజకీయంగా ప్రోత్స హిస్తూ వారికి గ్రామాల్లో పనులు చేసే అవకాశం కలి ్పంచాలని సూచించారు. ఇతర పార్టీల్లో ఉన్న యువ కులను స్వాగతించి బీఆర్‌ఎస్‌లో చేర్చుకునే విధం గా నాయకులు పని చేయాలని చెప్పారు. ఎన్నికల ప్పుడు అందరు జాగ్రత్తగా ఉండాలని, ఇతర పార్టీల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని సూచించారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసు కుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధులో యువతకు ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. అంతకుముందు ప్రజాగాయకుడు సాయిచంద్ మృతి పట్ల నివాళి అర్పించారు. సాయిచంద్ అందరి మనసులను దోచుకున్నారని, ఆయన లేరనే విషయాన్ని జీర్ణిం చుకోలేకపోతున్నట్లు తెలిపారు. కాగా అడ్డాకుల, కాటవరం, రాచాల గ్రామాలకు చెందిన వివిధ పార్టీల యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్ర య్యసాగర్, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పం చ్‌లు శ్రీకాంత్, జయన్నగౌడ్, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రాణాలు అరచేతిలో..



కల్వకుర్తి మీదుగా హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి

- నిత్య ప్రమాదాలకు నిలయమైన హైదరాబాద్- శ్రీశైలం రహదారి
- రెండులైన్ల రోడ్డుతో అవస్థలు పడుతున్న వాహనచోదకులు
- ఆరులైన్లకు విస్తరిస్తామని 2019లో సీఎం కేసీఆర్ ప్రకటన
- డిండి వరకు నాలుగులైన్లు మంజూరైందని కేంద్రమంత్రి ప్రచారం
- ఇప్పటికీ డీపీఆర్‌కు నోచుకోని వైనం

కల్వకుర్తి: హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదా రి–765 రద్దీగా మారిపోయింది. శ్రీశైలం పుణ్యక్షే త్రంతోపాటు జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట వాసులు హైదరాబాద్‌కు రాకపోకలు సాగించేది ఈ రోడ్డుపైనే. అయితే ఈ రోడ్డు కేవలం రెండు లైన్ల రహదారి కావడంతో రోజురోజుకూ వాహనాల రద్దీ పెరిగిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ ఇక్కట్లతోపాటు నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకొని అమాయకుల ప్రాణా లు గాలిలో కలిసిపోతుండగా.. మరికొందరు అవి టి వారిగా మారుతూ మంచానికి పరిమితమవుతు న్నారు. అయితే 2014కు ముందు రాష్ట్ర రహదారిగా ఉన్న ఈ రోడ్డును జాతీయ రహదారి–765గా మా ర్చి తుక్కుగూడ (మహంకాళి) నుంచి ఆదిపూర్ వర కు రెండు లైన్లుగా మార్చారు. అప్పుడే నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తే ఎంతో మేలు జరిగేది. అయితే ఆ సమయంలో వాహనాల రద్దీ తక్కువగా ఉందన్న కారణంతో వదిలేయగా.. గడిచిన ఐదేళ్లలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది.

2019 ఆరంభంలోనే..

రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 ఆరంభంలోనే రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల వద్ద ఉన్న ఫార్మాసిటీ సందర్శనకు వచ్చిన సీఎం కేసీఆర్ అక్కడి వరకు ఆరు వరుసల రహదారిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కానీ, ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి పనులు జరగలేదు. ఇక రెండేళ్ల కిందట కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తుక్కుగూడ (మహంకాళి) నుంచి డిండి వరకు రెండు లైన్ల జాతీయ రహదారిని రూ.1,700 కోట్లతో నాలుగు లైన్లుగా మార్చుతున్నామని ప్రక టించారు. అయితే ఈ ఇద్దరు నేతల ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. కనీసం డీపీఆర్‌కూ నోచు కోలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో అదే రెండు లైన్ల రహదారితో వాహనచోదకులు నిత్యం అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తు న్నారు.

త్వరలోనే డీపీఆర్

హైదరాబాద్- శ్రీశైలం రోడ్డును నాలుగు లైన్లుగా మార్చడానికి చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం పేపర్ వర్కు జరుగుతుంది. ఆ తర్వాత పూర్తిస్థాయిలో డీపీఆర్ చేయడానికి ఏడాది సమయం పడుతుంది. ఈ వారంలోనే డీపీఆర్ వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుం టాం.
– గంగాధర్, కన్సల్టెంట్ అధికారి

తిరుపతి రోడ్డు పూర్తయితే..

ఇప్పటికే రద్దీగా ఉన్న హైదరాబాద్- శ్రీశైలం రహదారికి కొత్త గేట్ సమీపం నుంచి కల్వకుర్తి- తిరుపతి జాతీయ రహదారి మంజూరైన విషయం తెలిసిందే. ఈ రోడ్డు నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, సోమశిల మీదుగా ఏపీలోని కర్నూలు జిల్లా నంద్యాల మీదుగా తిరుపతి వెళ్తుంది. ఫలితంగా తిరుపతి పుణ్యక్షేత్రం వెళ్లడానికి దాదాపు 80 కి.మీ., మేర తగ్గుతుంది. హైదరాబాద్ నుంచి తిరుపతి, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు కల్వకుర్తి రహదారి ప్రధాన మైంది. కొత్త గేట్ వరకు రెండు పుణ్యక్షేత్రా లకు, కల్వకుర్తి, అచ్చంపేట వైపు వెళ్లే వాహనాలకే ఇదే దారి. దాదాపు 60 కిలో మీటర్ల దూరం ఉండగా.. కొత్త గేట్ వద్ద రెండు మార్గాలుగా చీలిపోతాయి. ఇప్పుడే ఇలా ఉంటే తిరుపతి రోడ్డు పూర్తయిన తర్వాత నాలుగు లైన్ల రహదారి కాకపోతే ఈ రోడ్డుపై వెళ్లడం చాలా కష్టం. ఇప్పటికే తిరుపతి రోడ్డు టెండర్ పూర్తయ్యి.. భూ సేకరణ జరుగుతుంది. కాంట్రాక్టర్ పనులు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. కృష్ణాన దిపై బ్రిడ్జి మినహా సోమశిల నుంచి కల్వకు ర్తి వరకు రెండేళ్లలో పని పూర్తవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అప్పటి వరకు కల్వకుర్తి నుంచి తక్కుగూడ (మహంకాళి) వరకు నాలుగు లైన్ల రోడ్డు పూర్తి చేస్తేనే బాగుంటుంది. అయితే డీపీ ఆర్ పూర్తి కావడానికే ఏడాది పడితే.. నిధులు కేటాయించి, టెండర్ పిలిచి.. పనులు మొదలుపెట్టడానికి ఇంకెన్ని సంవ త్సరాలు పడుతుందోనని స్థానికులు విమ ర్శిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని వేగంగా నాలుగు లైన్ల రహదారి నిర్మాణం పూర్త య్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

17 వేల వాహనాలు

జాతీయ రహదారిగా మార్చే సమయంలో ప్యాసింజర్ కార్ యూనిట్ (పీసీయూ) ఏడు వేల వాహనాలు అని గుర్తించారు. ఆ లెక్కన రోజు 7 వేల వాహనాలు వెళ్లాయని లెక్క. ఇప్పుడు పీసీయూ ప్రకారం 17 వేల వాహనాలు వెళ్తున్నట్లు అంచనా అంటే వాహనాల రాకపోకల సంఖ్య గణనీయంగా పెరిగి రోడ్డుపై ఊహించని రద్దీ ఏర్పడుతోంది.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

గద్వాల: ప్రజా వ్యతిరేక విధానాలు అవలం బిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హెచ్చరిం చారు. ఆదివారం మండలంలోని పరుమాల, కుర్వపల్లి, కాకులారం, సంగాల, మర్లపల్లి, జిల్లె డబండ, గోన్‌పాడు, శెట్టిఆత్మకూర్‌లో బీజేపీ జెం డా పండుగలు నిర్వహించగా.. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. మోసపూ రిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ముఖ్య మంత్రి కేసీఆర్ అన్నివర్గాల ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫ ల్యాలు, వాస్తవాలను ప్రజల ముందుంచితే జీర్ణిం చుకోవడం లేదని, కేవలం ప్రధాని మోదీ, బీజేపీని తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. తెలంగా ణలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. దేశంలో బీజేపీతోనే అన్నివర్గాల అభ్యు న్నతి, సంక్షేమం సాధ్యమన్నారు. తను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవ ర్గంలో చేపట్టిన అభివృద్ధే నేటికీ కనిపిస్తుందని తెలి పారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజల సమస్యలపై పోరాటం సాగించామని చెప్పారు. 50 ఏళ్లుగా గద్వాల ప్రజలు డీకే బం గ్లాకు అండగా ఉన్నారని.. మీరు చూపిన అభి మానం మరవలేనిదని, ఇదే సహకారాన్ని కొనసా గించాలని కోరారు. అంతకుముందు జమ్ములమ్మ ఆలయంలో పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామ చంద్రారెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, విష్ణువర్ధన్‌రెడ్డి, బండల వెంకట్రాములు, తిరుప తి, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, రాధాకృష్ణరెడ్డి, కృ ష్ణమూర్తి, జయరాములు, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ నేత డీకే అరుణ

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

భూత్పూర్: మండలంలోని మద్దిగట్లలో ఆదివారం ప్రమాదశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల మల్లేష్(31) శనివారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో గ్రామ సమీపంలోని మద్దిఖాన్ చెరువులో చేపలు పట్టడానికి వెళ్తున్నానని భార్య మమతకు చెప్పి వెళ్లాడు. రాత్రి ఎంతకూ రాకపోవడంతో గ్రామస్తులు, బంధువులతో కలిసి మద్దిఖాన్ చెరువు దగ్గరికి వెళ్లి చూడగా కనిపించలేదు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన కావలి నాగయ్య అటుగా వెళ్లడంతో చెరువులో వ్యక్తి శవం తేలినట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వెంటనే మల్లేష్ కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా మల్లేష్‌గా గుర్తించి భూత్పూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మల్లేష్ భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోడకూలి వెల్దండ వాసి..

వెల్దండ: మండలంలోని కేస్లీతండా గ్రామ పంచాయతీ పరిధిలోని తుమ్మలకుంటతండాకు చెందిన రామావత్ రామ్‌జనాయక్(43) హైదరాబాద్‌లో ఆదివారం మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. తండాకు చెందిన రామ్‌జనాయక్, భార్య భారతి జీవనోపాధి కోసం మూడేళ్ల క్రితం హైదరాబాద్ వలస వెళ్లారు. తుక్కుగూడ సమీపంలో ఉన్న ఫ్యాబ్ సిటీ కంపెనీలో బిల్డింగ్ పనులు చేస్తుండగా భార్యాభర్తలతో పాటు మరో ఏడుగురిపై గోడ పడడంతో ప్రమాదానికి గురయ్యారు. రామ్‌జనాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యభారతి, కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శంషాబాద్ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ వెల్దండ మండల గిరిజన నాయకులు కంపెనీ వద్ద నిరసన తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శంకర్‌నాయక్, శ్రీనునాయక్ ఉన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. మండల పరిధిలోని నసరుల్లాబాద్ గ్రామానికి చెందిన కాశమోని ఆంజనేయులు(45) మోటర్ బైక్‌పై జడ్చర్ల నుంచి నసరుల్లాబాద్‌కు వెళ్తుండగా చర్లపల్లి గ్రామ సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య బాలమణి, ముగ్గురు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అసత్య ప్రచారం చేసిన యువకుడిపై కేసు నమోదు

గద్వాల క్రైం: ఓ దంత వైద్యురాలు మృతి చెందినట్లు పలు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వైరల్ అయ్యింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు... గట్టు మండలానికి చెందిన ఓ దంత వైద్యురాలు ఇటీవల ప్రేమవివాహం చేసుకున్నారు. వైద్యురాలు మేజర్. వివాహం చేసుకున్న వ్యక్తి నారాయణపేట జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నాడు. ఇది నచ్చని ఇరుకుటుంబాల సభ్యులు ఎస్సై రామస్వామిని కలిశారు. ఇరువురి కులాలు వేరు కావడంతో అమ్మాయి తరపు బంధువులు పెళ్లిని నిరాకరిస్తూ వాగ్వాదం చేసుకున్నారు. ఈ విషయం తెలియడంతో డీఎస్పీ సమక్షంలో మరోసారి ఇరువురి కుటుంబ సభ్యులతో శాంతియుత వాతావరణం కల్పించేలా కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే ఈ విషయాన్ని జీర్ణించుకోలేక వైద్యురాలి బంధువు (సోదరుడు) సామాజిక మాధ్యమాల్లో వైద్యురాలు మృతి చెందిదంటూ పోస్టు చేశాడు. ఇది వైరల్‌గా మారడంతో పలువురు ఈ సంఘటనపై ఆరా తీశారు. వైద్యురాలు మృతి చెందిందని అసత్య ప్రచారం, ఎస్సైపై సైతం ఆరోపణలు చేస్తూ పోస్టు చేయడంపై పోలీసులు తప్పు బట్టారు. ఈ పోస్టు చేసిన విజయ్ భాస్కర్ నాయుడిపై (అడ్వకేట్) కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై రామస్వామి తెలిపారు.

చిన్నారులపై వీధికుక్కల దాడి


గాయపడిన చిన్నారి

లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లిలో ఇద్దరు చిన్నారులపై వీధికుక్కలు దాడి చేసి గాయపర్చిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీధర్, రాంప్రసాద్ అనే చిన్నారులు ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమివేయడంతో చిన్నారులు ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారు. అనంతరం చిన్నారులను అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు.

నల్లమలలో విహారానికి విరామం

- ఫర్హాబాద్ సఫారీ మూసివేత
- సెప్టెంబరు వరకు మూడు నెలలు నిషేధాజ్ఞలు
- అమ్రాబాద్ టైగర్ రిజర్వు(ఏటీఆర్)లో ఆంక్షలు


ఫర్హాబాద్ సఫారీ

అచ్చంపేట: వర్షాకాలం ప్రారంభం కావడంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వు(ఏటీఆర్) ప్రవేశించకుండా నిబంధనలు కఠినతరం చేశారు. జంతువుల సంతానోత్పత్తి అనువైన సమయం కావడంతో ఈనెల 3నుంచి నుంచి సెప్టెంబరు వరకు మూడు నెలల పాటు విరామం ప్రకటించారు. జంతువులకు ఇబ్బంది కలుగకుండా పర్యాటకులు, జంతు సందర్శకులను అనుమతించకుండా ఫర్హాబాద్ సఫారీని తాత్కాలికంగా మూసివేశారు. దీంతో నల్లమలలోని ఫర్హాబాద్, వ్యూ పాయింట్, చెంచుపెంటల్లో పర్యటించే అవకాశం ఉండదు. తిరిగి అక్టోబర్ 1నుంచి సఫారీ టూర్ ప్రారంభం కానుంది.

సంతానోత్పత్తికి అనువైన సమయం..

నల్లమల అడవులు, వన్యప్రాణులు అంతరించిపోతున్న సమయంలో వన్యప్రాణుల సంతతిని పెంచుటకు అటవీశాఖ 2018లో తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలు ఇవ్వడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో పర్యాటకుల కదలికలు లేకుండా ఆంక్షలు విధిస్తున్నారు. వన్యప్రాణులు ఏడాదంతా జతకట్టినా, ముఖ్యంగా పెద్దపులి జతకట్టు సమయం ఇదే. ఆడపులుల గర్భధారణ సమయం 16వారాలు అయితే. ఆడపులి గర్భధారణ సమయంలో ఉన్నట్లు వాటి మూత్రవిసర్జన గుర్తుల ఆధారంగా మగ పులులు ఆకర్షించబడుతాయి. సాధారణంగా ఒక ఈతలో 3–4 పులి పిల్లలకు జన్మనిస్తాయి. వీటిని దట్టమైన అడవి ప్రాంతాలు లేదా రాతిపగుళ్లు, నెర్రెలు ఉన్న ప్రాంతాల్లో పొదుగు చేసుకుంటాయి. ఆడపులి జీవిత కాలంలో సుమారుగా సమాన సంఖ్యలో ఆడ, మగ పిల్లలకు జన్మనిస్తుంది. ఆడ పులులు సంతానోత్పత్తికి సిద్ధమయ్యే కాలం 3–4 సంవత్సరాలు. కాగా మగ పులులు కాస్త ఆలస్యంగా 4–5 సంవత్సరాల కాలంలో సంతానోత్పత్తికి సిద్ధమవుతాయి.

మూడు నెలల పాటు..

జూలై నుంచి సెప్టెంబర్ వరకు పులులు, ఎలుగుబంట్లు, ఇతర జంతువుల సంతానోత్పత్తికి అనువైన రోజులు కావడంతో వాటి ఏకాంతానికి భంగం కలుగవద్దని నిషేధాజ్ఞలు విధించారు. ఈ మూడు నెలల పాటు అటవీప్రాంతంలోకి పర్యాటకులు, ఇతరులను అనుమతించరు. ఈతరుణంలో వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకుండా రాష్ట్ర అటవీశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జిల్లా అటవీశాఖ అధికారులు మరింత సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. జంతువుల కదలికలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారు. అదే విధంగా అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న నల్లమల ప్రాంతంలోని పలు పర్యాటక ప్రాంతాలతో పాటు అక్కమహాదేవి గుహలకు వెళ్లే మార్గాలకు వెళ్లే అవకాశం లేదు.

నిరంతర ప్రక్రియ..



నల్లమల అందాలను తిలకించే యాత్రికులు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అనుమతులు లేకుండా అడవిలోకి ప్రవేశించడంపై ఆంక్షలు నిరంతరం కొనసాగే ప్రక్రియ. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పెద్దపులి జతకట్టే రోజులు కావడంతో మూడు నెలల పాటు యాత్రికులను అనుమతించడం లేదు. ఫర్హాబాద్ వ్యూ పాయింట్ సఫారీ సేవలు నిలిపివేశాం. పర్యాటకులు అటవీశాఖ అధికారులకు సహకరించాలి.

– రోహిత్‌గోపిడి, జిల్లా అటవీశాఖ అధికారి

అతిపెద్ద టైగర్ రిజర్వు...

రాష్ట్రంలో పేరుగాంచిన అడవులు నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలోని ఏటీఆర్‌తో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ అడవులు ఉన్నాయి. ఇందులో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్టుగా అమ్రాబాద్ అభయారణ్యం గుర్తింపు పొందింది. 2,611.39 చదరపు కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. ఇందులో 2,166.37 చదరపు కిలోమీటర్లు అభయారణ్యం కాగా, 445.02 చదరపు కి.మీ బఫర్‌జోన్‌గా ఉంది. అభయారణ్యాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. అటవీశాఖ లెక్కల ప్రకారం నల్లమలలో 21 పెద్దపులులు, 4 పిల్లలు, 57 చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, దుప్పులు ఇతర జంతువులు ఉన్నాయి.


నల్లమల అటవీ ప్రాంతం

పోలీసులపై బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్


మాట్లాడుతున్న యుగంధర్‌గౌడ్

జడ్చర్ల టౌన్: జడ్చర్ల పోలీసుల పనితీరుపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని, బాధితుల తరపున అవసరమైతే జాతీయ బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని శిఖర్‌గానిపల్లికి చెందిన వెంకటమ్మ, మండ్ల వెంకటస్వామి, స్వామిలకు చెందిన భూ తగాదాల వ్యవహారంలో పోలీసుల తీరును ఆయన తప్పుబట్టారు. బాధితులు అనేకమార్లు ఫిర్యాదు చేసినా ఎదుటివారిపై కేసులు నమోదు చేయడం లేదని, ఈ విషయంలో ఇప్పటికే డీఎస్పీ, ఎస్పీ, మానవ హక్కుల కమిషన్‌లకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా బాధితులపై జరిగిన దాడులకు సంబంధించిన ఆధారాలు సమర్పిస్తామని, వెంటనే వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 100కు డయల్ చేశారని వెంకటస్వామిని పోలీసు కానిస్టేబుల్ చేయిచేసుకుని దుర్భాషలాడారని ఆరోపించారు. భూ వివాదాలకు సంబంధించి కోర్టులో కేసులు నడుస్తున్నందున వాటి పరిష్కారం కోర్టుల్లోనే తేలుతాయన్నారు. అయితే బాధితులపై ప్రత్యక్షదాడులు చేసినా ఎందుకు కేసులు చేయడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీకి తొత్తులుగా మారారని, జడ్చర్ల పోలీసులపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని వాటిపై విచారణ చేయాలని, లేకపోతే పోలీస్‌స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడుతాం



సమావేశ వేదికపై ఎస్‌బీఐ ఉద్యోగ యూనియన్ నాయకులు

- ఎస్‌బీఐ ఉద్యోగ యూనియన్ నాయకులు
- ఉమ్మడి జిల్లా ఎస్‌బీఐ ఉద్యోగ యూనియన్ సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎస్‌బీఐ ఉద్యోగుల సంక్షేమానికి తమ యూనియన్ పాటుపడుతుందని ఎస్‌బీఐ ఉద్యోగుల (స్టాఫ్) యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాం, శ్రీనివాస శర్మ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఏఎస్ఎన్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా ఎస్‌బీఐ ఉద్యోగుల యూనియన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఉద్యోగ యూనియన్ సభ్యులు క్రిస్టియన్‌పల్లి చౌరస్తా నుంచి ఫంక్షన్‌హాల్ వరకు భారీ ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉద్యోగ యూనియన్ నాయకులు బ్రాంచీ లోకల్ సెక్రటరీ విధులు, దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పులపై ప్రసంగించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను అమలు చేయాలని, ఫ్యామిలీ పెన్షన్ అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అనంతరం యూనియన్ నాయకులను ఘనంగా సన్మానం చేశారు. సమావేశంలో హైదరాబాద్ డిప్యూటీ జనరల్ సెక్రటరీలు శ్రీనివాస్, శాండిల్య, నల్లగొండ ప్రాంతీయ యూనియన్ ఉపాధ్యక్షులు కేఎస్ నందన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీధర్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, రీజినల్ సెక్రటరీ నరేశ్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎస్‌బీఐ ఉద్యోగ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగ యూనియన్ సభ్యులు

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడు మృతిచెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని నెల్లికొండలో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. ప్రకారం నెల్లికొండ గ్రామానికి చెందిన కేశవులుగౌడ్ (55) జూన్ 25న ఇంటి నుంచి పొలానికి వెళుతున్నానని కుటుంబసభ్యులకు చెప్పి బయల్దేరాడు. ఆ రోజు ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే ఆదివారం ఉదయం వ్యవసాయ పొలంలోని బావి నుంచి దుర్వాసన రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు బావిలో నీటిపై తేలియాడుతున్న కేశవులు గౌడ్ మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య అలివేలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

జడ్చర్ల: పట్టణంలోని విజయనగర్ కాలనీలోని రోడ్‌నంబర్–2లో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు (60) మృతి చెందినట్లు ఎస్‌ఐ ఖాదర్ తెలిపారు. మృతదేహాన్ని బాదేపల్లి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. అయితే ఆమె బాదేపల్లి బస్టాండ్‌లో యాచకురాలిగా అనుమానిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాంకి చెరువులో మొసలి కలకలం

నర్వ: మండలంలోని యాంకి గ్రామ ఊర చెరువులో మొసలి సంచారం కలకలం రేపింది. కొన్ని రోజులుగా చెరువులో నీళ్లు తగ్గిపోవడంతో మొసలి ఒడ్డుకు చేరుకుంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. చెరువు గ్రామానికి సమీపంలో ఉండటంతో చిన్నపిల్లలు రోడ్డు దాటాలంటే భయంతో జంకుతున్నారు. అటవీ శాఖ అధికారులు వెంటనే మొసలిని బంధించి తీసుకెళ్లాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విగ్రహాల అపహరణ


చోరీకి గురైన వేణుగోపాలస్వామి ఆలయం


చోరీకి గురైన ఉత్సవ విగ్రహాలు

అయిజ: మండలంలోని వేణిసోంపురంలో తుంగభద్రానది పక్కన నిర్మించిన వేణుగోపాల స్వామి ఆలయంలో రాగితో తయారుచేసిన ఉత్సవ విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాలు.... శనివారం రాత్రి వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుడు విజయేంద్రాచారి స్వామివారి పూజ ముగించుకొని ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం ఆలయంలో పూజ చేసేందుకు వెళ్లగా ఆలయంలోని తలుపులు పగులగొట్టి ఉన్నాయి. వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ ఉత్సవ విగ్రహాలు అపహరించినట్లు ఆలయ పూజారి గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నరేష్ కుమార్ పోలీస్ బృందంతో అక్కడకు చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

శివాలయంలో హుండీ చోరీ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబళాపురంలోని శివాలయంలో శనివారం హుండీ చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పూజారి కులకర్ణి విజయభాస్కర్‌శర్మ శనివారం పూజలు చేసి, 8గంటలకు ఆలయం మూసి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం తిరిగి గుడికి వచ్చాడు. గుడి తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి గ్రామంలో విచారణ చేపట్టారు. ఆలయంలో హుండీ డబ్బులు సుమారు రూ.2వేలు, అమ్మవారి తాళిబొట్టు గ్రాము బంగారం చోరీకి గురైందని అన్నారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కేటీ మల్లేష్ తెలిపారు.

స్టేటస్ పెట్టి.. విద్యార్థి ఆత్మహత్య


మనోహర్ (ఫైల్)

నవాబుపేట: 'ఐ మిస్ యూ ఫ్రెండ్స్' అని వాట్సప్‌లో స్టేటస్ పెట్టి ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మల్కాపూర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోస్గి మనోహర్(16) తన వాట్సప్ గ్రూప్‌లో ఐ మిస్ యూ ఫ్రెండ్స్ అని స్టేటస్ పెట్టి తమ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మనోహర్ స్టేటస్ చూసిన అన్న మల్లేష్ తమ్ముడి కోసం వెతకగా పొలంలో చెట్టుకు ఉరివేసుకున్నట్లు గమనించి బంధువులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి చూసి మృతదేహాన్ని కిందకి దించారు. ఈ ఘటనపై మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

బాలికల సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

జడ్చర్ల టౌన్: నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 8 నుంచి జరగనున్న 12వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలికల్ సబ్‌జూనియర్ జట్టును ఆదివారం బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఎంపిక చేశారు. కార్యక్రమానికి మొత్తం 60 మంది బాలికలు హాజరుకాగా వారిలో ప్రతిభ ఆధారంగా 25 మందిని ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 7 వరకు హైస్కూల్‌లోనే శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమానికి జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్ హాజరై విద్యార్థులను అభినందించారు. ఎంపికైన బాలికలు నిజామాబాద్‌లో జరిగే పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు గజానంద్, నగేష్, కిశోర్, భానుకిరణ్, రామకృష్ణ, మోయిన్, కిట్టు తదితరులు పాల్గొన్నారు. బాలికల జట్టుకు కోచ్‌గా సోని వ్యవహరించనున్నారు.


ఎంపికైన బాలికలతో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు

కంప్రెషర్ ట్రాక్టర్ పేలి ఇద్దరి దుర్మరణం

- నాగర్‌కర్నూల్ జిల్లా రాయలగండిలో ఘటన


ప్రమాద స్థలంలో పడి ఉన్న మృతదేహం, దగ్ధమైన కంప్రెషర్ ట్రాక్టర్

అమ్రాబాద్: కంప్రెషర్ ట్రాక్టర్ పేలి ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని రాయలగండి శివారు నక్కలగుట్ట వద్ద చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. అచ్చంపేట మండలం హాజీపూర్‌కు చెందిన వరికుప్పల బాబు(40) తన సొంత కంప్రెషర్ ట్రాక్టర్‌పై అదే గ్రామానికి చెందిన డేరంగుల పుల్లయ్య(35)తో కలిసి బండలను తొలగించేందుకు ఆదివారం పదర వెళ్తున్నారు. ఈ క్రమంలో నక్కలగుట్ట వద్ద ట్రాక్టర్‌లో ఉన్న జిలెటిన్ స్టిక్స్‌తో వెళ్తుండగా ప్రమాదవశాత్తు పేలడంతో బాబు అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా కాలి గాయపడిన పుల్లయ్యను 108లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాబు మృతదేహాన్ని అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. బాబుకు భార్య ఎల్లమ్మతోపాటు కుమారుడు ఉన్నాడు. ఘటనా స్థలాన్ని సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ తిరుపతిరెడ్డి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

హత్య చేసి.. మృతదేహాన్ని తగులబెట్టి !

కర్నూలు: తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామక్రిష్టాపురం గ్రామానికి చెందిన కావలి భారతయ్య (55)ను హత్య చేసి కర్నూలు జిల్లాలోని కల్లూరు మండలం ఉల్లిందకొండ సమీపంలోని కొల్లంపల్లి తండా వద్ద తగులబెట్టిన కేసు మిస్టరీని కొత్తకోట పోలీసులు ఛేదించారు. హతుని భార్య ఫిర్యాదు మేరకు మొదట మిస్సింగ్ కేసు కింద నమోదు చేసిన పోలీసులు ఆచూకీ కనుగొనే క్రమంలో అనుమానితుడైన అదే గ్రామానికి చెందిన గడ్డం రవీంద్రగౌడును అదుపులోకి తీసుకుని తవదైన శైలిలో విచారించగా అసలు విషయం బయట పడింది. గడ్డం రవీంద్రగౌడ్, కావలి భారతయ్య మధ్య వ్యక్తిగత తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ... గత నెల 26వ తేదిన తెలంగాణ రాష్ట్రం అప్పరాల గ్రామం వద్ద గడ్డం రవీంద్రగౌడ్ మిత్రుడు మహమ్మద్ షఫీ సహాయంతో కిడ్నాప్ చేసి మారుతీజెన్ కారులో అప్పరాల గ్రామం నుంచి కొత్తకోటకు వెళ్లే దారిలో టవల్‌తో గొంతు బిగించి హత్య చేశారు. మృతదేహాన్ని కనుమరుగు చేయాలనే ఉద్దేశంతో కొత్తకోట నుంచి బెంగుళూరు వైపు ప్రయాణిస్తు కల్లూరు మండలం ఉల్లిందకొండ సమీపంలోని కొల్లంపల్లి తండాకు 2 కిలోమీటర్ల దూరంలో తిప్పరోని గుట్ట రాళ్ల మధ్యలో శవాన్ని పడేసి వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి తగులబెట్టి పరారయ్యారు. గడ్డం రవీంద్రగౌడ్ ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం కొత్తకోట పోలీసులు అతన్ని వెంటబెట్టుకొని సంఘటనా స్థలానికి వచ్చారు. మృతదేహం పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేకుండా ఉండడంతో కర్నూలు మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ అండ్ మెడిసిన్ ప్రొఫెసర్ డా.బ్రాహ్మాజీ, జీజీహెచ్ సీఎంఓ డాక్టర్ క్లింటన్ చక్రవర్తి, పీజీ విద్యార్థులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, అభినయ్‌తో కలిసి శవ పరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్పు చేసి అనుమానితుడు గడ్డం రవీంద్రగౌడ్, మహమ్మద్ షఫీపై కేసు నమోదు చేసినట్లు కొత్తకోట సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు విషయంలో ఉల్లిందకొండ పోలీసుల సహకారం తీసుకున్నట్లు సీఐ చెప్పారు.